# లక్ష్మీపురం చెరువు

బారెడు పొద్దెక్కింది. పొయ్యిలో పిల్లి లేవలేదు. ఆ భార్యాభర్తలు ఎడమొహం పెడ మొహంగా కూర్చున్నారు.

'నిన్నే...' అది భర్త అధికార స్వరం.

వంటింట్లోంచి సమాధానమేమీ రాలేదు.

'నిన్నే.. ఏం చేస్తున్నావ్?' మళ్ళీ భర్త పిలుపు వినవచ్చింది. ఈసారి ఆ గొంతులో కొంచెం అసహనం తొంగి చూసింది.

'ఊ... నీరసంగా మూలుగు వినిపించింది.

అదే ప్రత్యుత్తర మనుకుని కాబోలు, 'నేనలా పొలం దాకా వెళ్ళి వస్తాను' అని అన్నాడు భర్త. తుండుగుడ్డ దులిపి పైన వేసుకున్న సవ్వడి ఆమె చెవిలో పడింది.

'అప్పుడే ఎండ చుర్రు మంటోంది. అయినా యిప్పుడెందుకు పొలానికి?' ఆమె మాట మామూలుగానే వుంది. ఆమె శాంతించినట్లు ఆయన గ్రహించాడు. కొంచెం ధైర్యం వచ్చింది.

'పొద్దున లేచి యింతవరకూ పొలం వైపు వెళ్ళలేదు. ఒక్కసారి అలా వెళ్ళి వస్తా...'

ఆయన మాట వినిపించిందో లేదో, స్నానానికని ఆమె బయలుదేరింది. భుజాన చీర, చంకలో బిందె, చేతిలో పసుపు పొట్లం. ఏదో ఆలోచిస్తూ ఆమె అడుగులో అడుగువేసుకుంటూ నడక సాగించింది. పొలానికని బయలుదేరిన ఆయన అరుగుమీద కూలబడిపోయాడు. తన చూపులన్నీ ఆమె వెడుతున్న వైపే కేంద్రీకరించాడు. తిష్టవేసిన కోపం మటుమాయమయింది. భార్య పట్ల ఎక్కడలేని జాలి కలిగింది. నాలుగైదు నిమిషాలు అలా చూస్తూనే కూర్చుండి పోయాడు. మనస్సులో రకరకాల భావాలు పరుగులు తీశాయి.

ఈ కుగ్రామంలో పది పదిహేను యిళ్ళకంటే ఎక్కువలేవు. ఐదారు యిళ్ళవాళ్ళు తన వాళ్ళే. అంతా బీరకాయపీచు! మిగిలిన యిళ్ళ వాళ్ళు కూడా తన కంటే కొంచెం ముందుగానో తనతో పాటే వచ్చి ఆ గ్రామంలో స్థిరనివాసాలు ఏర్పరచుకున్నవారే. వివిధ వృత్తులకు చెందినవారే అయినా గ్రామమంతా ఒక్క కుటుంబంగా కలిసి మెలిసి ఉంటోంది. భూలక్ష్మినే నమ్ముకుని అంతా కాలక్షేపం చేస్తున్నారు. పాడిపంటలకు కొరత లేదు. కూరగాయలు పొలం గట్లమీద సమృద్ధిగా పండుతున్నాయి... కానీ మంచినీళ్ళు!

ఆయన భావతరంగాలు ఉన్నట్టుండి ఆగిపోయాయి; చలనం లేని రాతి బొమ్మల్లా కనపించాయి. పైపెచ్చు మనస్సుని విషాదం ఆక్రమించింది. అన్నీ ఉన్నాయి. ఏం లాభం? ప్రాణాధారమైన మంచినీళ్ళు మినహా తాను ఆ కుగ్రామంలో స్థిరపడడం వల్ల, కట్టుకున్న యిల్లాలు మంచినీళ్ళకోసం ప్రతిరోజూ నానా తిప్పలు పడుతోంది. కనీసం అరమైలు నడిస్తేనే గానీ మంచినీళ్ళ బావి కనిపించదు. అంటే ప్రక్కగ్రామానికి వెడితేనే గంగోదకం లభిస్తున్నది.! గుక్కెడు మంచినీళ్ళు త్రాగడానికి వీలవుతుంది. వాన రోజుల్లో అయితే బురదలో జర్రుబుర్రుమని జారుకుంటూ స్త్రీలు పడే యాతన యింతా అంతా కాదు.

కూర్చున్నవాడల్లా గభాలున లేచాడు. పచార్లు చేశాడు. ఏమనుకున్నాడో ఏమిటో, ఆయన యింట్లోకి వెళ్ళాడు. ఇంట్లో ఏముందని శూన్యంగా కనిపించింది. తనకా వయస్సు పైబడుతోంది. శక్తిసన్నగిల్లుతోంది. ఎన్ని సంపదలుండి మాత్రం ఏ లాభం? అనుభవించేందుకు ఎవరున్నారని!... అప్పుడప్పుడు తల్లిపాడిన గుర్తుకి వచ్చింది.

కొడుకుల్లు పుట్టని కడుపేమి కడుపు?

కుల ముద్ధరించన్ని కొడ కేమి కొడుకు?

ఇంట్లో ఉండలేకపోయాడు. దయ్యాల కొంపగా కనిపించింది. బయటికి వచ్చి మళ్ళీ అరుగుమీద కూర్చున్నాడు. మనస్సు స్థిమితంగా లేదు... ఇంతకూ పొద్దున నేనేమన్నానని.. దానికి ఎక్కడలేని కోపం

వచ్చింది. కంట తడి పెట్టింది. ఎవరినైనా దత్తత చేసుకుందాం... వంశం నిలుస్తుంది. వృద్ధాప్యంలో మనకు దిక్కుగా వుంటాడు.

ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

మంచినీళ్ళ బావి నుంచి భార్య వస్తున్నదేమోనని నాలుగడుగులు ముందుకు వేసి పరీక్షగా చూశాడు. భార్య రావడం గమనించాడు. ఆమె ఒక చోట ఆగి, చంకలోని బిందెను కింద పెట్టింది. కొన్ని క్షణాల తర్వాత మళ్ళీ నడక సాగించింది. బిందె మొయ్యలేక కింద పెట్టి వుంటుంది. రొప్పుతూ రోజుతూ వస్తోందని అనుకున్నాడు. వీధి వాకిలికి గొళ్ళెం పెట్టి భార్యకు ఎదురు వెళ్లాడు అంగలు వేసుకుంటూ.

సమీపిస్తున్న భర్తను చూడగానే, పొద్దున ఆయన మీద వచ్చిన అంతకోపమూ చెప్పకుండానే మాయమైపోయింది. మాట కొంచెం కటువు...కానీ వెన్న లాంటి మనస్సు అని పశ్చాత్తాపం చెందింది.

తడి చీరలో ఉన్న భార్యను చూసీ చూడగానే, 'మన వూళ్ళో చెరువంటూ వుంటే యిలా నువ్వు మంచినీళ్ళకోసం తిప్పలు పడే దానివి కావు' అన్నాడు.

మందహాసం చేస్తూ ఆమె అంది. 'నేనొక్కదాన్నేనా... మన వూళ్ళో ఆడవాళ్ళందరూ యింతే. ఇంతమాత్రం మీరు జాలైనా పడుతున్నారు. అదే నాకు పదివేలు' ఆమె నడకవేగం కొంచెం పెరిగింది. అది బహుశా భర్త చూపిన సానుభూతి ఫలితం కాబోలు.

ఇద్దరూ యిల్లు చేరుకున్నారు. దారిలో మౌనం వహించాడు.

ఆమె నీళ్ళ బిందె వంటింట్లో పెడుతుంటే ఆయన అన్నాడు. 'మన వూళ్ళో చెరువు లేకపోవడం నాకెందుకో తలవంపులుగా కనిపిస్తోంది. మనం నడుం బిగిస్తే నాలుగైదు నెలల్లో మన వూళ్ళోనూ చెరువు కనిపిస్తుంది.

'అంటే...'

'మనకు చెరువు కావాలి. కనుక తవ్వడం మొదలు పెట్టాలి..'

చెరువు తవ్వడం మన వల్ల జరిగే కార్యమేనా అన్నట్టు ఆమె నవ్వింది.

'ఇప్పుడు సందేహిస్తూ నవ్వావు. రేపు సంతోషంతో నవ్వుతావు..'

'అయితే మంత్రాలకు మామిడికాయలు రాలుతాయని మీ వుద్దేశం!' 'నువ్వు చూస్తూ వుండు. మామిడికాయలు రాలుతాయో, మంచినీళ్ళే పడతాయో...' అంటూ ఆయన పంచాగం చూడసాగాడు.

కొన్ని క్షణాలు యిట్టే గడిచిపోయాయి.

ఆయన ముఖంలో అంతులేని సంతోషం, కొత్తబలం ఏదో ఆయనలో ప్రవేశించింది.

ఎర్రగా వేగిన కందిపప్పు గిన్నెలో నీళ్ళు పోసేసరికి కమ్మని వాసన వంటింట్లోంచి వెలువడి యిల్లంతా వ్యాపించింది.

'ఇవ్వాళ మనింట్లో కమ్మని పప్పువాసన వచ్చినట్లుగా, రేపు మన వూరంతా కమ్మని నీళ్ళ వాసనకి సంతోషిస్తుంది' అంటూ ఆయన వంటింట్లోకి వచ్చాడు. భార్య వంక ప్రేమగా చూశాడు.

'పుట్టి మునిగిపోయినట్టుగా యిందాక పంచాంగం చూశారు. ఏమంటోంది మీ పంచాంగం?' నవ్వుతూ అడిగింది. ఆయన కదినవ్వుగా కనిపించలేదు. వెక్కిరింతగా తోచింది.

'ఎల్లుండి మంచిరోజు వర్షం రాత్రికిగానీ రాదు. అమృతయోగం..'

'లేడికి లేచిందే పరుగన్నట్టుగా, ముహూర్తం కూడా పెట్టేశారన్నమాట!' మళ్ళీ నవ్వింది.

'నువ్వలా నవ్వుతూ వుండు...'

'నవ్విన నాపచేనే పండుతుంది లెండి'

'తథాస్తు.. నువ్విప్పుడు ఎంతగా నవ్వుతున్నావో, రేపంతగా సంతోషిస్తావు..'

'అయితే తవ్వడం మొదలు పెడతారన్నమాట.'

'అన్నమాటేమిటి! ఖచ్చితంగా. మళ్ళీ రేపటిలాంటి మంచిరోజు దగ్గర్లో లేదు.'

భర్త దృఢ నిశ్చయానికి ఆమె కొంచె నిర్ఘాంతపోయింది. ఆయనది ఉడుము పట్టని ఆమెకు తెలుసు. మౌనం వహించింది.

'పోనీవే, యిప్పటికైనా నవ్వులాటలు కట్టిపెట్టి నువ్వు నా మనసు గ్రహించావు' అన్నాడు ఆయన కొంచెం తీవ్రంగా.

'ఇన్నాళ్ళుగా మీతో కాపరం చేస్తున్నా మీ మనస్సు తెలియకపోవడమేమిటి? ఎవరైనా వింటే నవ్విపోతారు.'

'మరి, తెలిసే నన్ను వేళాకోళం పట్టించావా యిందాకటి నుంచీ?' ప్రశాంతంగా అన్నాడు.

'చెరువు తవ్వకం అంటే మాటలా! అది మన వల్ల అవుతుందా? అనిపించి అలా అన్నాను.' ఆమె మాటల్లో పరిహాసానికి బదులు గాంభీర్యం ప్రస్ఫుటమయింది. 'మీ సంకల్పబలం, చిత్తశుద్ధి నాకు తెలియనవి కావు. సందేహం కొద్దీ అలా అడిగాను' అంది మళ్ళీ.

'ఎల్లుండి నుంచీ మనం పనిలో దిగుదాం.' ఆమె బదులు చెప్పలేదు.

'ఇంకా సందేహమా!'

'అలాగే లెండి...' నవ్వుతూ చెప్పింది.

'నువ్వు మనస్ఫూర్తిగా అంటే చాలు, పని అదే సానుకూల మవుతుంది.'

'ఇప్పుడు నాకు కొండంత ధైర్యం వచ్చింది.' ఏనుగు బలం వచ్చింది.

'ఇప్పటికే బాగా పొద్దెక్కింది... మడి బట్ట కట్టుకోండి, భోజనం చేద్దురు గానీ' అంటూ ఆమె ముక్కల పులుసులో తిరగమాత పెట్టింది. తర్వాత విస్తరి కడిగి పీట ముందు వేసింది. పీట పక్కన పెద్ద రాగి చెంబులో మంచినీళ్ళు పోసింది. చెంబుకి పక్కగా చిన్న రాగి పంచపాత్ర ఉంచింది. ఆ తర్వాత ఆమె దేవుడి ముందు దీపారాధన చేసింది. ధ్యానంలో మునిగింది.

భోజనానంతరం వక్క పలుకు వేసుకుని ఆయన భార్యకు కొంచెం దూరంగా కూర్చున్నాడు. ఆమె అప్పుడు భోజనం చేస్తోంది.

'ముద్దపప్పు, దోసవరుగుకూర, పండు మిరపకాయల కారం, ముక్కల పులుసు, గడ్డ పెరుగు–యిలా మనసుకి నచ్చిన భోజనం జీవితాంతం లభిస్తే చాలు. అన్నీ వున్నాయి.. కానీ..అంటూ నిట్టూర్చాడు.,

'పడిన గోడలు పడినట్టే వుంటాయిటండీ..' ఆమె అంది పులుసన్నం తింటూ.

'అంటే.'

'మీకు తెలీనట్టు...నా చేత చెప్పించాలని గానీ...'

'నీకా నమ్మకం వుంటే చాలు. అదే నాకు పరమ సంతోషం.'

పెరుగు కలుపుకుంది. ముద్దనోట్లో పెట్టుకుంటూ ఏదో ఒక నిర్ణయానికి వచ్చినట్టుగా కనిపించింది. అబద్దమైతే యేం, ఆయనకి సంతోషం కలిగితే చాలనుకుంది. చివరికి అబద్ధం చెప్పడానికే తెగించింది 'మనకు మంచిరోజులు త్వరలోనే వస్తాయి. మీరేమీ దిగులు పడకండి' అని చెప్పింది, చిరునవ్వు నవ్వుతూ.

'ఈ శుభవార్త ఉదయమే చెపితే, నేనసలు దత్తత విషయం ప్రస్తావించి వుండేవాణ్ణి కాను. నాకు మాత్రం దత్తత అంటే యిష్టమనుకున్నావా?'

'రెండు మూడు నెలలు గడిచిన తర్వాత చెపుదామనుకున్నాను' ప్రతిమాట తూచి తూచి చెప్పింది.

ఆయన బ్రహ్మానంద భరితుడయ్యాడు. భర్త సంతోషం చూసి ఆ యిల్లాలు తెచ్చుకున్న సంతోషంతో మందహాసం చేసి ఊరుకుంది.

ఆనాడు తెల్లవారురఝామున పారపళ్ళికలతో ఆ భార్యభర్తలు బయలుదేరారు. గ్రామంలో మధ్య ఒక చోట ఆయన నిలిచాడు. ఇదే చెరువుకి తగిన చోటు. రోజులు గడిచేకొద్దీ చెరువు చుట్టూ ఇళ్ళు లేస్తాయి. అప్పుడందరికీ చెరువు అందుబాటులో వుంటుంది. అంటూ ఆయన పారతో తవ్వడం మొదలు పెట్టాడు. తవ్విన మట్టిని ఆమె పళ్ళికలో పోసుకుని కొంచెం దూరం వెళ్ళి అక్కడ పోసేది. ఇలా మొదలైంది చెరువు తవ్వకం.

ఆ దృశ్యాన్ని గ్రామస్థులు చూశారు. ఆశ్చర్యచకితులయ్యారు. వెంటనే ఆయన్ని సమీపించారు.

'ఏమిటి శాస్త్రుర్లుగారు, తవ్వుతున్నారిక్కడ?' అడిగారు ఒక్కసారిగా.

తవ్వుతున్న పారను కిందపెట్టి, 'యిక్కడ చెరువు తవ్వుదామని

అనుకున్నాను. మంచినీళ్ళు పడతాయి. చెరువు లేక మన ఆడవాళ్ళు పడుతున్న యాతన యింతా అంతా కాదు...' మాట పూర్తి చెయ్యలేదు ఆయన, పారలు పళ్ళికలతో బిలబిలమంటూ గమిగూడారు గ్రామస్థులు. 'మేం తవ్వుతాం, మేం తవ్వుతాం' అంటూ ముందుకు వచ్చారు. నిన్నటి దాకా పిచ్చిమొక్కలేవో పెరిగి చదునుగా ఉన్న నేల యిప్పుడు చిన్న చిన్న గోతులతో కనిపిస్తోంది.

మూడు నెలలు గడిచాయి.

చెరువు పని సాగిపోతోంది.

ఆయన ఆమెను నిశితంగా పరీక్షించాడు. గర్భం దాల్చినట్లుగా భావించాడు. లోలోన ఉప్పొంగిపోయాడు. అప్పుడప్పుడు తన సంతోషాన్ని వ్యక్తం చేయసాగాడు.

ఆమె చెరువు పనిలో నిమగ్నురాలు కావడం చూసి, ఒక వృద్ధుడు ఆయన్ని సమీపించి, 'శాస్త్రులుగారూ, తెలిసిన మీరే యిలా చేస్తున్నారేమిటి?' అని ప్రశ్నించాడు, చొరవచేసుకుని, అందుకాయన సిగ్గుపడుతూ 'ఇంట్లోనే కూర్చోమన్నాను. కానీ మాట వినిపించుకుంటే గదా! కొంచెం మొండిఘటం' అన్నాడు ఆమెకు వినిపించేలా.

ఆమె తలవంచుకుంది. లోలోపల బాధ పడింది. ఆమె బాధ ఆమెకే తెలుసు. మంచిరోజులు వస్తున్నాయని భర్తతో చెప్పినప్పటి నుంచీ ఆమె ఆందోళన చెందసాగింది. తాను చెప్పింది అబద్ధమనీ, భర్తను తృప్తిపరచడానికే తానలా చెప్పిందనీ ఆమెకు తప్ప మరెవ్వరికీ తెలియదు, అయితే ఆ అబద్ధాన్ని కప్పిపుచ్చాలి! ఎలా? ఆలోచనచేసింది అదే పనిగా, చివరికి వారు నమ్ముకున్న దైవం మీద భారం వేసి ఒక యుక్తిపన్నింది. చూసేవారు, ముఖ్యంగా తన భర్త నమ్మడానికి వీలుగా ఆమె ఒక మూకుడు కడుపుమీద బోర్లించుకుని చీర కట్టుకోసాగింది. అందువలన ఆమె గర్భం ధరించినట్లు అందరూ విశ్వసించారు. కానీ ఆమె ఆందోళన..

మంచిని ఉద్దేశించి బుద్ధిపూర్వకంగా అబద్ధం ఆడిన వేళా విశేషమో, మూకుడు కడుపుమీద బోర్లించుకున్న వేళా విశేషమో, జనహితం కోరి

చెరువుపనిలో నిమగ్నురాలైన వేళావిశేషమో... ఆమె నిజంగానే గర్భవతి అయింది!

చెరువు పని పూర్తి కావస్తోంది.

తన చిరకాలవాంఛలు- తటాక నిర్మాణం, సంతాన ప్రాప్తి నెరవేరుతున్నందుకు ఆయన పొందిన సంతోషానికి మేర లేదు. ఆయన సంతోషం చూసి ఆ యిల్లాలు తనను తానే మరిచిపోయింది.